www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 19 మే 2024 8 పేజీలు

తూర్పుగోదావరి కాకినాడ కోనసీమ

పారితోషికం ఏదీ?

- బిఎల్ఒలకు నేటికీ అందని వైనం
- మూడేళ్లుగా ఎదురు చూపులు
- ఒక్కొక్కరికీ రూ.18 వేల వరకూ బకాయి

ఎన్నికల విధుల్లో భాగంగా ఓటరు స్లిప్‌లను పంచిబెడుతున్న బిఎల్ఒలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రజలకు ప్రజాస్వామ్య పాలన అందించడానికి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ఎన్నికల సంఘం కృషి చేస్తుంది. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరగడానికి వేల మంది సిబ్బంది సేవలు అవసరం. అటువంటి సేవలను క్షేత్రస్థాయిలో అందించిన బూత్ స్థాయి అధికారుల(బిఎల్ఓ)కు చెల్లించాల్సిన పారితోషికాన్ని మూడేళ్లుగా ఎన్నికల సంఘం చెల్లించడం లేదు. కమిషన్ అప్పగించిన పనిని క్రమం తప్పకుండా నిర్వహించి ఓటు హక్కు సేవలు సకాలంలో ప్రజలకు అందేలా తామంతా కషి చేస్తున్నామని, అయినా ఎన్నికల సంఘం ఇచ్చే అరకొర పారితోషకం మూడేళ్ళుగా అందకపోవడం బాధాకరమని బిఎల్ఒలు వాపోతున్నారు.

కాకినాడ జిల్లాలో 1,637, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 1,644, తూర్పుగోదావరి జిల్లాలో 1,577 మొత్తం మూడు జిల్లాల్లో 4,858 బూత్‌లు ఉన్నాయి. ఆయా బూత్‌ల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, విఆర్ఒలు తదితరులు బిఎల్ఒలుగా ఉన్నారు. ఒక్కో బూత్‌కి ఒక్కో బిఎల్ఓ పని చేస్తున్నారు. ఓటరు నమోదు నుంచి మొదలుకొని ప్రత్యేక కార్యక్రమాలు, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, ఓటరు స్లిప్‌ల పంపిణీ, ఇంటింటికీ వెళ్లి సర్వే చేయడం, మృతి చెందిన, వలస వెళ్లిన ఓటర్ల వివరాల తొలగింపునకు సంబంధించిన కార్యక్రమాలు వీరు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా ఎన్నికల సిబ్బందికి భోజన వసతి సౌకర్యాలు కల్పించే బాధ్యతలను కూడా

2లో..

సత్యదేవుడు పెళ్లి కొడుకాయనే...

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

ఎదుర్కోలు ఉత్సవంలో పాల్గొన్న ఇఒ, చైర్మన్

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం శ్రీ వీరవేంకట సత్య నారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సత్య దేవుడు, సత్యఅనంతలక్ష్మిలను పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తె అలంకరణలో శనివారం దర్శనమి చ్చారు. అణివేటి మండపంలో వివిధ సుగంధభరిత పుష్పాలతో అలంకరించిన వేదికపై పెండ్లిపెద్దలైన క్షేత్రపాలకులు సీతారాముల సమక్షంలో ఈ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకిం చేందుకు విచ్చేసిన భక్తులకు స్వామివారి ప్రసాదం, వడపప్పు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ రాజా ఐవి.రోహిత్, ఇఒ కోడూరి రామచంద్రమోహన్, దేవస్థానం అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. రత్నగిరిపై గల కళామందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా అర్చకస్వాములు ప్రత్యేక పూజలు చేశారు. చైర్మన్, ఇఒ, ఇతర అధికారులు, పండితులు స్వామి, అమ్మవార్ల తరుపున రెండు బృందాలుగా విడిపోయి పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెల గుణ,గుణాలను, వంశ చరిత్రను వర్ణిస్తూ ఒకరిపై ఒకరు చమత్కారాలు, హాస్యోక్తులతో ఆద్యంతం కార్యక్రమాన్ని రక్తికట్టించారు. తదుపరి హాజరైన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అనంతరం పెండ్లిపెద్దలైన సీతారాములను వెండి ఆంజనేయ వాహనంపై గ్రామంలో ఊరేగించి ఆదివారం జరగబోయే శ్రీ సత్యదేవుని కళ్యాణోత్సవానికి భక్తులను ఆహ్వానిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా

సత్యదేవుని బ్రహ్మోత్సవాల నిర్వహణ

ప్రజాశక్తితో ఇఒ కె.రామచంద్రమోహన్



ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం సత్యదేవుని కళ్యాణోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని దేవస్థానం ఇఒ కె.రామచంద్రమోహన్ తెలిపారు. కళ్యాణోత్సవాల నేపథ్యంలో ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఈనెల 18 నుంచి 24 వరకు ఈ కళ్యాణోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వారం రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారనే అంచనాలతో పాలక మండలి సలహాలు సూచనలతో ఇప్పటికే పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. తాను 2009 నుంచి 2011 వరకు ఇఒగా పనిచేశానన్నారు. ఆ సమయంలో నిర్వహించిన ఉత్సవాల అనుభవం ఉందన్నారు. అలగే నేడు ఉత్సవాల ఏర్పాట్లపై యంత్రాంగంతో పాటు జిల్లాలో వివిధ శాఖల సిబ్బందితో విడతలవారీగా నిర్వహించిన సమీక్షలతో చిన్నపాటి లోపం కూడా లేకుండా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నానన్నారు. ఈ వారం రోజుల్లో నిర్వహించే ఉత్సవాల్లో ఐదు రోజులపాటు కొండ దిగువన రోజుకొక వెండి రథాలపై స్వామివారికి ఊరేగింపు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా రూ.కోటిని వెచ్చించి టేకుతో భారీ రథాన్ని తయారు చేయించామన్నారు. ఈనెల 22న స్వామి వారికి నిర్వహించే రథోత్సవం ప్రత్యేక ఆకర్షణ నిలుస్తుందన్నారు. అంతేగాక వారం రోజులు కొండపైన, కొండ దిగువన సంప్రదాయ కళలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం రాత్రి కొండపైన నిర్వహించే సత్యదేవుని కళ్యాణోత్సవం జరిగే వేదికను అత్యంత సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు. తిరునాళ్లను తలపించే విధంగా ఏర్పాట్లు పూర్త చేశామన్నారు. కల్యాణోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయ కమిషనర్ పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఈ సారి విద్యుత్ దీపాలంకరణ భక్తులును కట్టిపడేస్తుందన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు
శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామి వారి దేవస్థానం
అన్నవరం, కాకినాడ జిల్లా
వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవములు
ది. 18-05-2024 వైశాఖ శుద్ధ దశమి శనివారం నుండి
ది. 24-05-2024 బహుళ పాడ్యమి శుక్రవారం వరకు

దివ్య కళ్యాణము
ది. 19-05-2024 ఆదివారం
రాత్రి గం|| 9.30 ని||ల నుండి
రథోత్సవము
ది. 22-05-2024 బుధవారం
సా|| 05.00 గం||ల నుండి
కొండ దిగువ గ్రామోత్సవము
శ్రీ పుష్పయాగ మహోత్సవము
ది. 24-05-2024 శుక్రవారం
రాత్రి 7.30 గం||లకు కొండపై
నిత్యకళ్యాణ మండపం నందు

శ్రీ రాజా ఐ.వి.రోహిత్
వ్యవస్థాపక కుటుంబ సభ్యులు & చైర్మన్
శ్రీ అనంతలక్ష్మీ సత్యదేవుల కళ్యాణం వీక్షించి పునీతులు కండి...
అదనపు కమిషనరు మరియు
కార్యనిర్వాహణాధికారి

కౌంటింగ్‌కు పార్కింగ్ ప్రదేశాల ఎంపిక

ప్రజాశక్తి-అమలాపురం

రానున్న జూన్ 4 వ తేదీ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కాలేజ్ చుట్టుపక్కల పార్కింగ్ ప్రదేశాలను ఎంపిక ప్రక్రియను ప్రారం భించామని జిల్లా ఎన్నికల అధికారి హిమాన్సు శుక్లా తెలిపారు. శనివారం స్థానిక కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలో ఉన్న శ్రీనివాస ఇంజినీరింగ్ కాలేజ్ చుట్టుపక్కల ప్రభుత్వ సిబ్బం ది ,ప్రజాప్రతినిధుల వాహనాలు పార్కింగ్ కొరకు ఐదు, ఆరు పార్కింగ్ స్థలాలను పరిశీలన చేశామన్నారు. ఇప్పటివరకు నాలుగు పార్కింగ్ స్థలాలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల్లో అమలాపురం పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూముల సీళ్లను తొలుత జిల్లా ఎస్పితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం స్ట్రాంగ్ రూములకు అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను వారి పరిశీలించి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 25 నాటికి కౌంటింగ్ రూముల ఏర్పాటు పూర్తి చేశామని ఆయన తెలిపారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు తేదీ రోజున శ్రీనివాసా ఇంజినీరింగ్ కాలేజ్ వద్ద ట్రాఫిక్ మళ్లింపు ప్రక్రియ చేపట్టి ఓట్ల లెక్కింపుకు మరియు పౌర జీవనానికి ఏ విధమైన ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీధర్, అమలాపురం ఆర్‌డిఒ అమలాపురం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి జి కేశవర్ధన్ రెడ్డి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఎస్.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ ప్రదేశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా

జూన్ 6 వరకు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్

జూన్ 6వ తేదీ వరకు శాంతి భద్రతల పరిరక్షణకై జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్సు శుక్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈనెల 13 న జరిగిన పోలింగ్‌కు సంబంధించి ఇవిఎంలను కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల్లో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారని అక్కడే కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు ఏర్పాట్లు చేశారని ఆయన తెలిపారు. స్ట్రాంగ్ రూములు కౌంటింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల సమస్యలు, ఉల్లంఘనలకు కారణమయ్యే సంఘట నలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నందున ఈనెల 14 నుంచి జూన్ 6 వరకు ప్రజా ప్రశాంతత కొరకు శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా, 144 సెక్షన్ అమ లును ప్రకటించామన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతను దృష్ట్యా ప్రశాంతమైన వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయడానికి 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ అనంతరం పలు జిల్లాల్లో చోటుచేసుకుంటున్న అల్లర్ల నేపథ్యంలో శాంతికి విఘాతం కలగకుండా చేయడం కోసం అన్ని జిల్లాల్లో కూడా 144 సెక్షన్ విధించారన్నారు. 14.5.2024 నుంచి 06.06.2024 (24X7) వరకు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు కౌంటింగ్ కేంద్రం నుండి 200 మీటర్ల పరిధిలో మారణాయుధాలతో లేకు ండా 4 లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తు లు సమా వేశాలు నిర్వహిం చరాదన్నారు. ఊరేగిం పులు చేయరాదని ఆదేశించారు. సాధారణ పౌర జీవనానికి ఏ విధ మైన ఆటంకాలు లేకుండా సంబంధిత సబ్ డివిజనల్ పోలీసు అధికారులు ఈ ఆదేశాలను సమర్థవంతమైన పద్ధతిలో అమలు చేస్తారని ఆయన ప్రకటనలో తెలిపారు.

దాతకు చిత్రపటం అందిసున్న ఆలయ సహాయ కమిషనర్ మాధవి

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్ కు దాత విరాళం అందజేశారు. కాకినాడకు చెందిన దూనబోయిన మంగాయమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు నాగ మల్లేశ్వరరావు (కోనసీమ జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ, సహాయ కమిషనర్) కోమల దంపతులు ప్రతి సంవత్సరం కార్తీక మాసం బహుళ త్రయోదశి రోజున అన్నదానము జరిపించు నిమిత్తం రూ.10,116 శనివారం విరాళంగా ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు. ఆలయ అర్చకులు మరియు ఆలయ సిబ్బంది దాత దంపతులకు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదంలు అందజేశారన్నారు

స్వామి వారి ఆదాయం రూ.4.31లక్షలు

బాల బాలాజీ స్వామి దేవస్థానం నందు శనివారం లడ్డు ప్రసాదం, దర్శనము టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.3,15,905, నిత్యాన్నదాన ట్రస్టనకు రూ.1,15,603 వెరశి మొత్తం రూ.4,31,508 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు. స్వామి వారిని 4,193మంది దర్శించుకుని 3,278మంది అన్న ప్రసాదం స్వీకరించారని ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు.

పుల్లేటికుర్రు హైస్కూల్లో ఇంటర్ అడ్మిషన్లు తీసుకుంటున్న హెచ్ఎం కనకదుర్గ

జూన్ 1 నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-అంబాజీపేట

పుల్లేటికుర్రు హైస్కూల్లో జూన్ 1వ తేదీన జూనియర్ ఇంటర్ తరగతులు ప్రారంభమవుతాయని హైస్కూల్ హెచ్ఎం కెఎస్.కనకదుర్గ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన అధ్యాపకులు(లెక్చరర్స్)తో మెరుగైన విద్యాబోధన అందిస్తారన్నారు. ఎంపిసి, సిఇసి గ్రూపులతో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఉచిత విద్య, ఐఎఫ్‌పి, బై జెస్ ట్యాబ్, వంటి వాటితో మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు. మరిన్ని వివరములకు ఫోన్ నెంబర్: 97045 82970లో సంప్రదించాలని ఆమె అన్నారు.

కల్వర్టుల పనులు వెంటనే ప్రారంభించాలి

ప్రజాశక్తి-మండపేట

మండపేట నుంచి ద్వారపూడి వెళ్లే రోడ్డు నిర్మాణంలో భాగమైన పంట కాలువలుపై ఉన్న కల్వర్టుల పనులు వెంటనే చేపట్టాలని ఎంఆర్‌పిఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దూళి జయరాజు మాదిగ కోరారు. శనివారం పాత్రికేయులతో ఆయన మాట్లాడారు. కాలువలు కట్టేసిన మరుక్షణమే పనులు మొదలు పెడతామనిగతంలో ఆర్ అండ్ బి అధికారులు చెప్పారని, కాలువ నీరు కట్టేసి పది రోజులు కావస్తున్నా నేటికీ కలవర్టుల పని ప్రారంభి ంచకపోవడం అధికారులు నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమేనని పేర్కొన్నారు. పనులు పూర్తికాక ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే పనులు చేపట్టి కాలువలకు నీరు విడుదల చేసేనాటికి పూర్తి చేయాలని అధికారులను జయరాజు కోరారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని మండల విద్యాశాఖ అధికారి సత్తి సత్య కృష్ణ సూచించారు. భీమనపల్లి శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సరస్వతి దేవి విగ్రహానికి స్వాతంత్ర సమరయోధులు దేశ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం శాఖా గ్రంథాలయ అధికారి నిమ్మకాయల శేషు కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్య కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో టీవీలకు, సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండి సమయాన్ని వథా చేసుకోకుండా శాఖా గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలని కోరారు. మే 15 నుంచి జూన్ 7 వరకు నిర్వహించే వేసవి శిక్షణ శిబిరంలో చదవడం మాకిష్టం అంటూ పుస్తకాలు చదవాలని కోరారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న సత్యకృష్ణ

బుద్ధ జయంతి ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఐ.పోలవరం

ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

పాతఇంజరం గ్రామ పంచాయతీ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం బుద్ధజయంత్యోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిఎస్ఐ జిల్లా అధ్యక్షులు పచ్చి మాల సుధీర్ మాట్లాడుతూ ఈ నెల 26న ఆదుర్రు ఆది దివ్య బౌద్ధ మహా స్థూపప్రాంగణంలో 2569వ బుద్ధ జయంత్యోత్సవాలు నిర్వహించిందని ఉత్సవాల నిర్వహణ కమిటీ నిర్ణయించిందన్నారు. ప్రతి ఒక్కరు ఈ ఉత్సవాలకు తరలి రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బిఎస్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశి వెంకటరమణ, బీర అంబేద్కర్, యలమంచిలి సురేష్, బొంతు శ్రీరాములు, కోరుకొండ మధు, తాటిపాక దుర్గబాబు, మెల్లం రాజేష్, కొమ్మబత్తుల రఘు, కన్నేడి సత్తిబాబు, కుంచే చినబాబు పాల్గొన్నారు.

దుకాణాల్లో పెట్రోల్ విక్రయించే వారిపై చర్యలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

పెట్రోల్ బంకుల్లో తప్ప కిళ్లీ షాపుల్లోనూ, దుకాణాల్లోనూ పెట్రోల్, డీజిల్ అమ్మకాలు జరిపిన వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా పెట్రోల్ బంకుల్లో మోటార్ సైకిల్ ట్యాంకుల్లో తప్ప వేరే బాటిల్లోనూ, కేనుల్లోనూ పెట్రోలు అమ్మకాలు జరపరాదన్నారు. నిబంధనలకు అతిక్రమించిన వారిపై చర్యలుతీసుకుంటామన్నారు.

కపిలేశ్వరపురంలో అన్నదానం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండల కేంద్రమైన కపిలేశ్వరపురం గ్రామంలో కొలువై యున్న పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద శనివారం భారీ అన్న సమాధాన జరిగింది. వీరబ్రహ్మేంద్ర స్వామి సమాధి అయిన రోజు సందర్భంగా ఆలయం వద్ద స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భారీ అన్న సమారాధనకు గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో యాత్రికులు, పాల్గొన్నారు.

పారితోషికం ఏదీ?

(మొదటిపేజీ తరువాయి)

వీరీ చూస్తున్నారు. స్థానిక సంస్థలు ఎన్నికలతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లోనూ, తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల విధుల్లోనూ వీరి పాత్ర కీలకంగా ఉంది.

నెలకు రూ.500 పారితోషకం

ఎన్నికల ప్రక్రియకు సంబంధించి మొత్తం పనులను క్షేత్రస్థాయిలో బిఎల్ఓలే చక్కబెడుతున్నారు. ఇందుకు గానూ వీరికి ఎన్నికల సంఘం నెలకు రూ.500 చొప్పున పారితోషకం ఇస్తున్నది. గతంలో దీన్ని నెలవారీ కాకుండా ఏడాదిలో మూడు, నాలుగు విడతల్లో చెల్లించేవారు. గత మూడేళ్లుగా ఈ సొమ్ములు రావడం లేదని బీఎల్ఓలు చెబుతున్నారు. ఏడాదికి రూ.6 వేలు చొప్పున మూడేళ్లకు రూ.18 వేలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. మూడేళ్లుగా గొడ్డు చాకిరీ చేస్తున్నా నామమాత్రపు పారితోషికం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని రకాల పనులు చేయించుకున్నా పారితోషికం ఇవ్వడంలో మొండిచేయి చూపించడంపై బీఎల్ఓలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓటర్ల జాబితాల సవరణ సమయంలో ఫారం 6,7,8లు తెచ్చి ఇవ్వండని ఒత్తిళ్ళకు గురి చేసి నిద్ర కూడా లేకుండా పనిచేయించుకున్నారని, సక్రమంగా పని చేయకపోతే సస్పెండ్ చేసేస్తామని బెదిరింపులకు సైతం గురి అయ్యామని వాపోతున్నారు. ఇటీవలే జరిగిన సార్వత్రిక ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రాల వద్ద ఫెసిలిటేషన్ బాధ్యతలను సైతం నాలుగైదు రోజుల పాటు రేయింబవళ్లు చేయించుకున్నారని చెబుతున్నారు. ఎన్నికల సంఘం ఇచ్చే రూ.500 తాము చేసే పనులకు పెట్రోల్ ఖర్చులకు, మెటీరియలకు సరిపోలేదని, అయినా ఇప్పటివరకు ఇవ్వలేదని తెలిపారు. పెండింగ్ పారితోషకంపై పలువురు బిఎల్ఓలు ఎన్నికల సంఘానికి ఆన్ లైన్ ద్వారా పిర్యాదులు పంపుతున్నారు.ఇప్పటికైనా స్పందించి మూడేళ్లకు తమకు ఇవ్వాల్సిన పారితోషికం బకాయి రూ.18వేలు వెంటనే చెల్లించాలని పలువురు కోరుతున్నారు.

పచ్చని చెట్ల నీడలో ఆహ్లాదకర ప్రయాణం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

బొబ్బర్లంక నుంచి మెర్లపాలెం వరకు, అలాగే ర్యాలీ నుంచి లొల్ల లాకులు వరకు మరియు ఊబలంక వరకు రోడ్లు పచ్చని చెట్లతో ప్రయాణం ఆహ్లాదకరంగా సాగుతుంది. ఒకవైపు మధ్య డెల్టా ప్రధాన కాలువ మరోవైపు పిల్ల కాలువలు, ముక్తేశ్వరం అమలాపురం కాలువల గట్లపై రెండు వైపులా పచ్చని చెట్లతో ఆహ్లాదంగా ఉండే ఈ రోడ్లలో ప్రయాణం చేస్తే మండు వేసవి కూడా చల్లగానే ఉంటుంది. ఈ ప్రాంతానికి టూరిస్టులు సైతం ఈ ఎక్కువగా వస్తుంటారు.

పచ్చని చెట్లతో ర్యాలి నుంచి ఆత్రేయపురం వెళ్లే రోడ్డు

గెలుపు లెక్కలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఇవిఎంలలో నిక్షిప్తమై ఉంది. ఎన్నికల ఫలితాలు వచ్చేందుకు మరో రెండు వారాల గడువు ఉంది. దీంతో గెలుపు లెక్కల్లో అభ్యర్థులు తలమునకలయ్యారు. గెలుపు తమదంటే తమదే అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. మొత్తంగా అభ్యర్థుల గెలుపోటములపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు, సామాన్య ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. ఈ నెల 13న పోలింగ్‌కు జిల్లా వ్యాప్తంగా ఓటర్లు పోటెత్తిన విషయం విధితమే. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఓటర్లలో చైతన్యం ప్రభుత్వంపై సానుకూలతా? లేక వ్యతిరేకత అనేదానిపై అభ్యర్థులు మల్లగుల్లాలు పడుతున్నారు. అధిక ఓటింగ్ ఎవరి కొంపముంచుతుందోననే గుబులు అభ్యర్థుల్లోనూ మొదలైంది. ఈ నేపథ్యంలో పోలింగ్ పూర్తయిన మరుసటి రోజు నుంచే విశ్లేషణలు ప్రారంభించారు. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. తాజా ఎన్నికల్లో రాజకీయ విశ్లేషకులు సైతం ఓటరు నాడి పట్టడంలో కొద్దిగా ఇబ్బందులకు గురవుతున్నారు. వీరి సంగతి ఇలా ఉండగా అధికారుల్లో టెన్షన్ వాతావరణం ఇంకా పోలేదు. కారణం తుది గట్టమైన కౌంటింగ్ ఇంకా జరగకపోవడమే. జూన్ 4న జరిగే కౌంటింగ్ ప్రక్రియకు వారు సమయాత్తమవుతున్నారు. ఇప్పటికే కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను పూర్తిచేశారు. అయితే బెట్టింగ్ రాయుళ్లు ఐపిఎల్ మ్యాచ్‌ల నుంచి రాజకీయాలకు యూ టర్న్ తీసుకున్నారు. అభ్యర్థుల గెలుపోటములతో పాటు, మెజారిటీపై పందేలు ప్రారంభించారు. బెట్టింగ్ రాయుళ్లకు అడ్డుకట్ట వేయడంలో పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. దేమైనా అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్దేశించిన ఓటర్ల తీర్పు తెలియాలంటే మరో రెండు వారాల పాటు ఆగాల్సిందే.

సర్వేల జోరు

అభ్యర్థుల గెలుపు ఓటములపై ఐవిఆర్ఎస్ సర్వేలు ఊపందుకున్నాయి. తాజాగా జరిగిన ఎన్నికల్లో మీరు ఎవరికి ఓటేశారంటూ ఫోన్ కాల్స్ ద్వారా జరుగుతున్న సర్వే ప్రజలకు తలపోటులా మారింది. రాజకీయ పార్టీలలో క్రియాశీలకంగా ఉండేవారితో పాటు, నాయకులు, కార్యకర్తలు ఈ సర్వేకు సమాధానం ఇస్తున్నారు. సామాన్య ప్రజలు తమ అభిప్రాయం వెల్లడించేందుకు వెనకడుగు వేస్తున్నారు. సమాధానం లభించని నెంబర్లకు పదే పదే ఫోన్‌లు రావటంతో ఓటర్లలో అసహనం వ్యక్తమవుతోంది. ఇటువంటి కాల్స్ నియంత్రణకు ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నత్తనడకన ధాన్యం కొనుగోలు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. నెల రోజులుగా రైతు భరోసా కేంద్రాల్లోని కొనుగోళ్లపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఎన్నికల్లో అధికార యంత్రాంగం నిమగ్నమవ్వడంతో కొనుగోళ్ల ప్రక్రియను సరిగా పట్టించుకోలేదనే అభిప్రాయం రైతులలో వ్యక్తమవుతోంది. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, ఇతర సాంకేతిక సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కౌలు రైతులను సిసిఆర్‌సి కార్డుల సమస్య వెంటాడుతోంది. ఫలితంగా కొనుగోలు కేంద్రాల మెట్లు ఎక్కలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు అల్పపీడన ద్రోణి నేపథ్యంలో కురుస్తున్న వర్షాలు అన్నదాతలకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దళారులను ఆశ్రయించక తప్పడంలేదు. ప్రభుత్వ మద్దతు ధరకు క్వింటాకు రూ.300 తక్కువగా విక్రయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపాలనే రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

వేట సాగక పూట గడవక

వేట నిషేదం నేపథ్యంలో మత్స్యకారుల పరిస్థితి దయనీయంగా మారింది. ఏప్రిల్ 14 నుంచి వేట నిషేదం అమలులోకి వచ్చిన విషయం విధితమే. జూన్ 15 వరకూ వేట నిషేదం అమలు తప్పనిసరి. మత్స్యకారులకు గతంలో బియ్యం, కూరగాయలతో పాటు, పప్పు దినుసులు, అపరాలతో పాటు ఆర్థిక సాయం అందించేవారు. కొన్నేళ్లుగా ఆర్థిక సాయానికే పరిమితం అయ్యారు. ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉండటంతో ఈ నెల ఇంకా వారికి పరిహారం అందలేదు. నెలరోజులైన పరిహారం అందకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రస్తుతం అప్పు పుట్టు పరిస్థితి కూడా లేదని, వెంటనే పరిహారం అందివ్వాలని వారు వేడుకుంటున్నారు. జిల్లాలో 3.55 లక్షల మంది మత్స్యకారులు ఉన్నారని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ రంగానికి అనుబంధంగా మరో 50 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం ఉపాధి లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

క్రైం వార్తలు

10 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని దొండపూడిలో 10 లీటర్ల నాటు సారాతో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఇబి సిఐ కెవి.స్వామి తెలిపారు. ఆరుగురు పాత నిందితులను తహశీల్దారు వద్ద బైండ్ ఓవర్ చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్

ప్రజాశక్తి - గోపాలపురం

వంట చేసే క్రమంలో ప్రమాదవశాత్తు గ్యాస్ బండ పేలింది. వంట చేసే వ్యక్తి ప్రాణాలతో బయటపడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. శనివారం స్థానిక సాయిబాబా గుడి సమీపంలో గూడూరి రాముడు అనే వ్యక్తి ఒక ఇంటిలో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం వంట చేసే క్రమంలో ప్రమాదవశాత్తు గ్యాస్ మంటలు వ్యాపించడంతో ఒక్కసారి బయటికి పరుగు తీశాడు. వెంటనే గ్యాస్ సిలిండర్ భారీ శబ్దంతో తునాతునకలై పేలిపోయింది. దీంతో వంటగది బీటలు తీసింది. ఇంటి కప్పు రేకు దెబ్బతింది.

ధ్వంసమైన ఇంటి లోపలి భాగం

సిసి టివి కెమెరాల కంట్రోల్ రూం ఏర్పాటు

పిఠాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా జెసి ఎస్.రామ్‌సుందర్ రెడ్డి

ప్రజాశక్తి - కాకినాడ

స్ట్రాంగ్ రూం భద్రతను పరిశీలించేందుకు విలుగా సిసిటివి కెమెరాల కంట్రోల్ రూము ఏర్పాటు చేయడం జరిగిందని పిఠాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి తెలిపారు. శనివారం జెఎన్‌టియులో ఏర్పాటుచేసిన సిసి టివి కెమెరాలు కంట్రోల్ రూంను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెఎన్‌టియులోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలు, ఇతర ఎన్నికల సామాగ్రిని సురక్షితంగా భద్రపరిచడం జరిగిందన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా స్ట్రాంగ్ రూం వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు స్ట్రాంగ్ రూం భద్రతను పరిశీలించేందుకు వీలుగా జెఎన్‌టియులోని క్యాంటీన్‌పై సిసి టివి కెమెరాల వ్యూను చూసేందుకు స్క్రీన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చునని తెలిపారు.

కంట్రోల్ రూమును పరిశీలిస్తున్న ఎస్.రామ్ సుందర్ రెడ్డి

ద్వారపూడిలో వాసవి జయంతి

ప్రజాశక్తి-మండపేట

వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ద్వారపూడి గ్రామంలో శనివారం ఘంనగా నిర్వహించారు. వాసవి యూత్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రదోష వేళలో 18 రకాల అభిషేకాలు, సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం అమ్మవారిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసుల నమోదు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 13న వల్లూరు గ్రామంలో కూటమి, వైసిపి శ్రేణులు, మధ్య జరిగిన కవ్వింపు చర్యల్లో పరస్పర కేసులు నమోదు అవుతున్నాయి . ఈ నేపథ్యంలో వల్లూరులో ఎన్నికల సందర్భంగా ఈనెల 13న తోపులాట జరిగింది. ఈ ఘటనలో కూటమి బలపరిచిన మండపేట నియోజకవర్గ టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి వేగుళ్ళ జోగేశ్వరరావు, జనసేన పార్టీ ఇన్‌చార్జి వేగుళ్ళ లీలా కృష్ణ, టిడిపి నాయకుడు వేగుళ్ళ వీరబాబులపై పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. వల్లూరు గ్రామానికి చెందిన పలివెల రోకేష్, నక్కా భాస్కరరావు, నక్కా అమ్మిరాజు లు తమను కులం పేరుతో దూషించారంటు విడివిడిగా ఫిర్యాదులు అందజేశారు. ఈ మేరకు ముగ్గురిపై అంగర పోలీసులు అట్రాసిటీ కేసులు నమోదు చేసినట్లు శుక్రవారం తెలిపారు.

కుంగిన గోదావరి ఏటిగట్టు

పొంచిఉన్న ప్రమాదం?

ప్రజాశక్తి-రామచంద్రపురం

కోటిపల్లి నుంచి సుందరపల్లి మధ్య గల కుమ్మరి సావరం వద్ద గోదావరి ఏటిగట్టు కుంగిపోయి బలహీన పడింది. దీంతో ఏటిగట్టు రోడ్డు వరకు గోదావరి లోనికి మట్టి జారిపోవడంతో ప్రమాదకరంగా ఉంది. రాత్రి సమయంలో ఈ ప్రాంతంలో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అదేవిధంగా వర్షాకాలంలో గోదావరి వరద నీటి ప్రవాహం పెరగడంతో పాటు ప్రతి సంవత్సరం ఆగస్టు నుండి అక్టోబర్ వరకు వరదలు సంభవిస్తుంటాయి. అటువంటి సమయంలో బలహీనంగా ఉన్న ఏటి గొట్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉండడంతో ఈ ప్రాంతంలో గ్రోయిన్లను నిర్మించారు. అయినప్పటికీ వర్షాలకు మట్టి పూర్తిగా కొట్టుకుపోయి కొమ్మరి వారు సమరం వద్ద ఏటుకట్టు బలహీన పడింది గోదావరి పరివాహక ప్రాంత రక్షణాధికారులు కన్వర్వెన్సీ శాఖ దీనిపై దష్టి సారించాల్సిన అవసరం ఉంది. కేవలం ఒక ఎర్రజెండాను ఇక్కడ కట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు. వచ్చే వర్షాకాలంలోపు ఇక్కడ మరమ్మతులు చేపట్టకపోతే గోదావరి ఉధతికి ఈ ఏటుకట్టు వద్ద ప్రమాదం జరిగే అవకాశం పొంచి ఉంది. గత ఏడాది బలహీనంగా ఉన్న గట్ల వద్ద ఇసుక మోటాలు వేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ ఇసుక మూటలు కొట్టుకుపోవడంతో పరిస్థితి మళ్ళీ యథాస్థితికి చేరుకుంది. ఈసారి వర్షాకాలం రాకుండా ముందే మరమ్మత్తు పనులు చేపడితే ప్రయోజనం ఉంటుందని లేదంటే చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందం గా ఉంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపై అధికారులు వెంటనే దష్టి సారించి జారిపోయిన ఏటికొట్టుకు మరమ్మతులు పూర్తి చేయాలని రోడ్డు ప్రమాదాలు నివారించాలని పరిసర ప్రాంతాల ప్రజలు ఏటిగట్టు వాసులు కోరుతున్నారు.

గ్రొయిన్ లు వేసిన నిరుపయోగమైన ప్రాంతం

గట్టు జారిన చోట ఏర్పాటుచేసిన ఎర్రజెండా

సవరణ

ది. 28-4-2024 సం॥ తేదీన ప్రజాశక్తి పేపరులో వాయుగుండ్ల చెంచురామయ్య గారి భార్య వాయుగుండ్ల వెంకటలక్ష్మి సుజాత గారు తరుపున డిపాజిట్ బాండ్సు పోయినట్లుగ ప్రచురణ ఇచ్చియున్నాము. అందులో ఈ డిపాజిట్ బాండ్సును బ్యాంకు డిపాజిట్ బాండ్సుగా పొరపాటున పొందుపరచటమైనది. కాని ఈ డిపాజిట్ బాండ్సు కాకినాడ కోపరేటివ్ బిల్డింగ్ సొసైటీ డిపాజిట్ బాండ్సుగా పరిగణనలోనికి తీసుకొనవలెను.

ఎస్.నూకరాజు, అడ్వకేట్
డోర్ నెం. 7-1-27/2, శేషగిరిరావు వీధి
రామారావుపేట, కాకినాడ, సెల్: 9848524409

పాస్‌పోర్టు పోయినది

కాకినాడ జిల్లా, ఏలేశ్వరం మండలం, తూర్పు లక్ష్మీపురం గ్రామానికి చెందిన మసిరపు మరియమ్మ, భర్త: మన్నియ్య అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు నంబర్ **L6946291,** మా ఇంటి వద్దనే అనగా ఏలేశ్వరం మండలం, తూర్పు లక్ష్మీపురం గ్రామం, డోర్ నెంబర్ 1-16 నందు పోయినది. ఆచూకీ తెలిసినవారు దిగువ చిరునామాకు తెలుపగలరు.

మసిరపు మరియమ్మ
భర్త: మన్నియ్య
తూర్పు లక్ష్మీపురం గ్రామం
ఏలేశ్వరం మండలం, కాకినాడ జిల్లా
సెల్:9346480820

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, అనపర్తి
O.S. No. 58/2023

Between:
1. వాలాజి జానికమ్మ
2. విల్లూరి మమ్ము
3. విల్లూరి టిన్ను -వాదులు

AND

నల్లమిల్లి బుచ్చియమ్మ & 6 ఇతరులు -ప్రతివాదులు

To:
D-4: పడాల దుర్గవేణి, D/o. సూర్యనారాయణ రెడ్డి, వయస్సు 32 సం॥లు, ప్రైవేట్ ఉద్యోగి మరియు గృహిణి, R/o. డో.నెం. 6-13, మహేంద్రవాడ రోడ్, రాయవరం గ్రామం, రాయవరం మండలం, తూ॥గో॥జిల్లా. (ఇప్పుడు డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా), అనపర్తి జేసీజేసీ.

D-5: పడాల కృష్ణవేణి, D/o. సూర్యనారాయణ రెడ్డి, వయస్సు 30 సం॥లు, గృహిణి, R/o. డో.నెం. 6-13, మహేంద్రవాడ రోడ్, రాయవరం గ్రామం, రాయవరం మండలం, తూ॥గో॥జిల్లా. (ఇప్పుడు డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా), అనపర్తి జేసీజేసీ.

పై నెంబర్ దావాలో 4, 5 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 18-06-2024 సం॥రం తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకోవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

R.V.G.PATNAIK
Advocate, Anaparthi
T.S.S.S.N.CHALAPATHI KUMAR
Advocate
Ramachandrapuram
అనపర్తి
16-05-2024

పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా 'మేరుగు'

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా మెరుగు రాజారావు 5వసారి ఎన్నికయ్యారు. కోనపాపపేటకు చెందిన మేరుగు రాజారావు న్యాయవాద వృత్తి చేపట్టినప్పటి నుంచి పిఠాపురంలోనే నివాసం ఉంటున్నారు. పిఠాపురం లోనే అందరితోనూ స్నేహపూర్వకంగా సుపరిచయాలున్న మేరుగు రాజారావు గత ఐదు సంవత్సరాలుగా బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికవుతూనే ఉన్నారు. ఈ ఏడాది ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ నా తోటి న్యాయవాదులు మిత్రులు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బార్ అసోసియేషన్ ఉన్నతికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. నూతనంగా నిర్మించిన కోర్టు భవనాన్ని త్వరలోనే ప్రారంభించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

నీతి కథలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో శనివారం నీతి కథల సారాంశంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ శిబిరంలో ఉపాధ్యాయులు ఆర్.వెంకటేశ్వరరావు విద్యార్థులతో నీతి కథలు చదివించి, నీతి కథలను చెప్పించారు. ఈ కార్యక్రమంలో సింగం బుల్లియ్య, పాఠకులు పాల్గొన్నారు.

22న రౌతులపూడి మండల సమావేశం

ప్రజాశక్తి - రౌతులపూడి

ఈ నెల 22న ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ ప్రేమ్‌సాగర్ శనివారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

బసవేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక బొప్పే వారి వీధిలోని బసవేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం మహా అన్నదానం నిర్వహించారు. బసవేశ్వర స్వామి 890వ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమంలో విశ్వనాథం సత్య పరదేశి, తాడిశెట్టి గంగాధరరావు, బనిశెట్టి సత్యనారాయణ, వాసా రాజా, బనిశెట్టి నాగేశ్వరరావు, వాసా సత్యనారాయణ, కుడకా మహేష్ తదితరులు సేవలందించారు.

వీరభద్రరావు దంపతులను సత్కరిస్తున్న జర్నలిస్టులు

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షునికి ఘన సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట

కాకినాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడుగా వరుసగా 3వ సారి ఎన్నికైన సామర్లకోటకు చెందిన ప్రముఖ న్యాయవాది కొర్లమండ వీరభద్రరావు, శ్రీవాణి దంపతులను సామర్లకోట శ్రీ భీమేశ్వర జర్నలిస్ట్ అసోసియేషన్ శనివారం ఘనంగా సత్కరించింది. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో నిర్వహించిన ఈ అభినందన సభలో ఉపాధ్యక్షులు వీర భద్రరావు మాట్లాడుతూ కాకినాడ బార్ అసోసియేషన్ సభ్యులంతా తనపై ఉన్న అభిమానాన్ని మూడోసారి కనపరిచారన్నారు. భీమేశ్వర జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ స్థానికంగా జర్నలిస్టుగా పనిచేసిన వీరభద్రరావు కాకినాడ బార్ అసోసియేషన్‌కు 3వ సారి ఉపాధత్యక్షునిగా ఎన్నికవ్వడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు, సామర్లకోట - పెద్దాపురం ఆర్చేస్ట్రా ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గిడుతూరి శ్రీనివాస్, జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు అడపా వెంకటరావు, పేమ్మాడి వీరభద్రవర్మ, డివిడి మల్లేష్, అందుగుల వీర్రాజు, తదితరులు మాట్లాడారు.

ఉద్యోగోన్నతిపై ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ బదిలీ

బ్రాంచ్ మేనేజర్ ను సత్కరిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - పిఠాపురం

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) పిఠాపురం బ్రాంచ్ మేనేజర్ ఎన్.రాముచౌహన్ పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయ సిబ్బంది, డవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్స్ ఘనంగా సత్కరించారు. డెవలప్మెంట్ ఆఫీసర్ల అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సత్కార సభలో ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కర్నేడి ఏడుకొండలు, రాజమండ్రి డివిజన్ కౌన్సిల్ ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షులు రావులు మాధవరావు మాట్లాడుతూ పిఠాపురం ఎల్ఐసి బ్రాంచ్ ఉన్నతికి, ఏజెంట్స్ అభ్యున్నతికి రాము చౌహన్ ఎంత గానో కృషి చేశారని కొనియాడారు. బ్రాంచ్ మేనేజర్ రాము చౌహాన్ మాట్లాడుతూ ఏజెంట్స్ డవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఆఫీస్ సిబ్బంది జాతీయస్థాయిలో పిఠాపురం ఎల్ఐసి బ్రాంచ్ ఉన్నతికి ప్రతి ఒక్కరు సహకారం అందించారన్నారు. అనంతరం రాము చౌహాన్‌ను శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పలువురు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ ఈనీల్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు సుబ్రహ్మణ్యేశ్వర రావు, వర్ధిని, పిఠాపురం బ్రాంచ్ ఎల్ఐసి ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు లోకా రెడ్డిరామకృష్ణ, కెవివి. సత్యనారాయణ, కోశాధికారి కొత్త రాంబాబు, బిఎస్. ప్రకాష్‌రావు, డవలప్‌మెంట్ ఆఫీసర్లు శ్రీనివాస్, చాముండేశ్వరి, పావని, శివ, పణి తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ షో ద్వారా శాస్త్రీయ అవగాహన

మ్యాజిక్ షో ప్రదర్శిస్తున్న శ్రీనివాస్

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో శనివారం జన విజ్ఞాన వేదిక సైన్స్ అండ్ టెక్నాలజీ జిల్లా కన్వీనర్ బుద్ధా శ్రీనివాస్ మ్యాజిక్ షో ద్వారా శాస్త్రీయ దృక్పథంపై బాలలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిమల పేరుతో అనేకమంది ప్రజలను మోసం చేస్తుంటారని, శాస్త్రీయ ఆలోచన విధానం ద్వారా మోసాలను బహిర్గతం చేసి వాస్తవాలు తెలుసుకోవచ్చున్నారు. ప్రతి ఒక్క అంశము శాస్త్రీయతతో ముడిపడి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి మ్యాజిక్ అంశాన్ని దాని వెనకనున్న వాస్తవాన్ని బాలలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ శిబిరంలో దుంగల పూజితా సూర్యశ్రీ కరాటే లో శిక్షణ ఇచ్చారు. నీలపాల కృష్ణ కర్రసాములో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ కుమార్, మంజుల, అమృత, సాయి, బంగారం, మణికంఠ, నేహా, రేణుక, శ్రీజ, కె.రవి, కె.పవన్ సేవలందించారు.

ఘనంగా వాసవి కన్యకాపరమేశ్వరి రథోత్సవం

కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవంలో పాల్గొన్న ప్రజలు

ప్రజాశక్తి - సామర్లకోట

వాసవి కన్యకా పరమేశ్వరి జన్మదిన మహోత్సవం పురస్కరించుకుని శనివారం వాసవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుతగా స్థానిక పెద్ద బజార్‌లో ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరి ప్రార్థన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం 108 కలశములతో ప్రదక్షిణ, 11 రకాల ద్రవములతో అభిషేకం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పురవీధుల మీదుగా రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి ఉత్సవ కమిటీ, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, వాసవి వనిత క్లబ్, ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు, వాసవి యంగ్ బాయ్స్, వాసవి యూత్ పెద్దఎత్తున పాల్గొన్నారు.

అవగాహన తరగతులను వినియోగించుకోవాలి

వివరాలను వెల్లడిస్తున్న యూటిఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కాకినాడ

10వ తరగతి లోకి ప్రవేశించిన విద్యార్థులకు మే 21 నుంచి జూన్ 5 వరకు నిర్వహిస్తున్న అవగాహన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక యుటిఎఫ్ హోంలో జరిగిన సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవిచక్రవర్తి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర వర్మ, పూర్వ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు ఎ.సంజయ్, నగర కార్యదర్శి ఎ.వాసు, జిల్లా కమిటీ సభ్యుడు సిహెచ్. సాహిత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి చక్రవర్తి మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు అత్యంత కీలకం కాబట్టి, భవిష్యత్తులో రాణించేందుకు ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిపుణులైన ఉపాధ్యాయులతో సుమారు 15 ఉచిత అవగాహన క్లాసులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మే 21 నుంచి జూన్ 5 వరకు ప్రతి రోజూ ఉదయం 8 గం నుంచి 10 గంటల వరకూ కాకినాడ కచేరిపేట యుటిఎఫ్ హోంలో ఈ తరగతులు జరుగుతాయన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9346264224, 7893211869 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

పెద్ద బాపనపల్లి లో రైతులతో మాట్లాడుతున్న రాజబాబు

ప్రజాశక్తి - తాళ్లరేవు

అరుగాలం పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. శనివారం మండలంలోని పెద్ద బాపనపల్లిలో ధాన్యం తూకం కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా కాలం వెళ్లబుచ్చుతుందన్నారు. రెండు సంవత్సరాల క్రితం ఢిల్లీలో చేసినటువంటి రైతు ఉద్యమం ఫలితంగా ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. 2014లో ప్రభుత్వం వేసిన మూడు కమిషన్ల ప్రకారం క్వింటా ధాన్యానికి రూ.3,300 ఇవ్వాలని చెప్పినప్పటికీ ఇప్పుడున్న బిజెపి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అందుచేతనే దేశంలో ప్రతి అరగంటకు ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడని వివరించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. ప్రస్తుతం ఎరువులు, పురుగు మందు లు వ్యవసాయ కూలీల ఖర్చులు యంత్రాల ఖర్చులు భూయజమానికి ఇవ్వవలసిన కౌలు, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసం కింటాకు రూ.4 వేలు పైబడి రైతుకు గిట్టుబాటు ధర ఇవ్వకపోతే వ్యవసాయం చేయలేని పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం ఇస్తున్న 75 కేజీలకు రూ.1500, క్వింటాకు రూ.2000 మాత్రమే ఇస్తున్నారని అన్నారు. కనీస మద్దతు ధర 2200 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు లేక అయినకాడకి అమ్ముకోవాల్సి వస్తుందనీ, ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

శృంగార వల్లభ స్వామికి రూ.4.04 లక్షల ఆదాయం

మజ్జిగను పంపిణీ చేస్తున్న నిర్వహాకులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామం లో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒక రోజు వివిధ దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,95,300, అన్నదాన విరాళాల ద్వారా రూ.94,492, కేశఖండన ద్వారా రూ.11,400, తులాభారం ద్వారా రూ.400, కానుకల ద్వారా రూ.3,000 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం, వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని మజ్జిగ చలివేంద్రం నిర్వహిం చామన్నారు. యాత్రికులకు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణా చార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు సేవలందించారు.

ఎన్‌సిసి క్యాడెట్లకు అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నవోదయ విద్యాలయలో నిర్వహిస్తున్న ఎన్‌సిసి క్యాడెట్ల శిక్షణా శిబిరంలో శనివారం ఎన్‌సిసి క్యాడెట్లకు అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించారు. కాకినాడ 18వ ఆంధ్రా బెటాలియన్ కమాండెంట్ కల్నల్ వివేక్ సావన్ గౌడర్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో పెద్దాపురం అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీహరి జగన్నాథ్ సారథ్యంలో అగ్ని ప్రమాదాల నివారణ పై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో భాగంగా అగ్ని ప్రమాదాలు జరగడానికి కారణాలు, అగ్ని ప్రమాదాల సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, గ్యాస్ వల్ల, భవనాల్లో అగ్ని ప్రమాదాల, అగ్ని ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని రక్షించే విధానాలపై అవగాహన కల్పించారు.

స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతపై ఆందోళన వద్దు

భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్‌ఓ

ప్రజాశక్తి - పెద్దాపురం

సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు ఇవిఎంల భద్రతపై ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని పెద్దాపురం ఆర్‌ఓ కె. సీతారామారావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కాకినాడ జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. జెఎన్‌టియులో జరిగే కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇస్తారని తెలిపారు.

గ్రూప్-2 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

గ్రూప్-2 మెయిన్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు బిసి స్టడీ సర్కిల్లో ఈ నెల 25న ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్టు బిసి స్టడీ సర్కిల్ సంచాలకులు పిల్లి సత్య రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో ఉతిర్ణత సాధించిన అభ్యర్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ప్రారంభిస్తామని, శిక్షణ తరగతులతో పాటు ప్రతి సబ్జెక్టుకూ సంబంధించిన ప్రాక్టీసు టెస్టులు, గ్రాండ్ టెస్టులు కూడా నిర్వహిస్తామని తెలిపారు. లైబ్రరీ సౌకర్యం స్టడీ మెటీరియల్ అందుబాటలో ఉన్నట్టు తెలిపారు. స్టయిఫండ్, బుక్స్ ఎలవెన్సెస్ సౌకర్యాలు ఉన్నట్టు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు సంబంధించిన అభ్యర్థులు ది డైరెక్టర్, ఎపి బిసి స్టడీ సర్కిల్, నియర్ ఆర్ట్స్ కాలేజ్, రాజమహేంద్రవరం, 533103కి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం 0883 2421129, 9393934825, 8639447339. ఫోన్ నంబర్స్‌లో సంప్రదించాలని తెలిపారు.

జాన్‌రాజ్ కుటుంబానికి చందన పరామర్శ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఇటీవల ప్రమాదంలో మరణించిన వైసిపి కార్యకర్త కుడిపూడి జాన్‌రాజ్ కుటుంబ సభ్యులను పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ శనివారం పరామర్శించారు. ఆయన వెంట వైసిపి నాయకులు మత్స్యేటి శివ, కొమ్మన కోటి, ముద్దాల అను, వెలుగొండ లక్ష్మి, చల్లాయమ్మ, ముత్యాల పోసి కుమార్, తోడేటి రాహుల్, కెవి.సుబ్బారెడ్డి, జ్వాల, కృపారావు, సత్యవతి పాల్గొన్నారు.

జన సమీకరణకు అనుమతులు లేవు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

జూన్ 15వ తేదీ వరకు మండలంలో ఎటువంటి జన సమీకరణలకు అనుమతులు లేవని ఎస్ఐ వి.అప్పలరాజు శనివారం తెలిపారు. ప్రస్తుతం ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు ఉన్న కారణంగా ఎటువంటి ఆత్మీయ సమావేశాలు, ఆర్కెస్ట్రాలు, జాతరలు, డిజెలు, వేషధారణలు, పొలిటికల్ సమావేశాలు నిర్వహించేందుకు అనుమతులు లేవని ఆయన తెలిపారు. ఒకవేళ జాతర వంటి కార్యక్రమాల తేదీలను ముందుగా నిర్ణయించుకుంటే వాటిని మార్చుకోవాలన్నారు. మండలంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర నిఘా ఉంటుందని ఆయన ప్రజలకు హెచ్చరించారు. ఇటీవల కొంతకాలంగా విగ్రహం ఏర్పాటు విషయంలో గొడవలు జరుగుతున్న కారణంగా తాడిపర్రులో కానిస్టేబుల్స్‌కు బాడీ కెమేరాలు ఏర్పాటు చేసి, ప్రత్యేక పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా తమ కార్యకలాపాలు నిర్వహించుకోవాలన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వేస్ట్ డీకంపోజర్‌పై రైతులకు అవగాహన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వరి పంట కోసిన తరువాత మిగిలిన వరి గడ్డిని కాల్చి వేయకుండా దాన్ని వేస్ట్ డీకంపోజర్ ద్వారా పొలంలోనే కుళ్ళబెట్టి సేంద్రీయ పదార్థాన్ని పెంచే విధానాన్ని రైతులకు అవగాహన కల్పించాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం ప్రణాళికలో భాగంగా దొమ్మేరులో శనివారం మట్టినమూనా సేకరణ, క్షేత్రసందర్శన, వేస్ట్ డికంపోజర్ తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట కోసిన తరువాత మిగిలిన వరి గడ్డిని కాల్చి వేయకుండా దాన్ని వేస్ట్ డీకంపోజర్ ద్వారా పోలంలోనే కుళ్ళబెట్టి సేంద్రీయ పదార్థాన్ని పెంచే విధానాన్ని రైతులకు అవగాహన కల్పించినట్టు చెప్పారు. డీకంపోజర్‌ను ఉపయోగించి పేడ, కూరగాయల వ్యర్థాలు, వ్యవసాయ వ్యర్థాలు, ఎండు కర్రలు, బెరడులను వేగంగా కుళ్లివేయవచ్చు. దాని నుంచి వచ్చే కంపోస్ట్ మట్టి ఎరువుగా ఉపయోగించవవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ కె.దక్షిణామూర్తి, డాక్టర్ సిహెచ్.సునీత, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్స్ డాక్టర్ టి.ఉషారాణి, డాక్టర్ డి.శేఖర్ పాల్గొన్నారు.

మతం పేరుతో మోడీ రాజకీయం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పదేళ్లలో నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ ప్రజలకు ఏ ఒక్క మంచి పనీ చేయలేదని, ఓడిపోతున్నామని తెలిసి నరేంద్ర మోడీ మతం పేరుతో రాజకీయాలు చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారంలో ప్రజలను మభ్యపెట్టడానికి మోడీ పచ్చి అబద్దాలు ఆడుతున్నారని కులాన్ని మతాన్ని ఉపయోగించి ఓట్లు పొందాలని చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన మూడూ మోడీకి వంత పాడుతున్నాయన్నారు. చంద్రబాబు, పవన్, జగన్‌కు మోడీపై ప్రేమ లేదని, ఏదో కేసు పేరుతో జైల్లో వేస్తారని భయం ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పోలీసుల సాయంతో ఎన్నికలు నిర్వహించాలని,

సమావేశంలో మాట్లాడుతున్న కె.రామకృష్ణ

ప్రతిపక్షాలను భయపెట్టాలని చూశారన్నారు. కొత్త ఇసుక పాలసీ అమలు చేస్తానని చెప్పిన జగన్ లక్షలాది భవన నిర్మాణ కార్మికులు రోడ్డుని పడేశారన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రభుత్వ ప్లస్ 2 కో-ఎడ్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్టు హెచ్ఎం బి.సూర్యకాంతం తెలిపారు. మండలంలోని సత్యవాడ, జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం నూతనంగా కో ఎడ్యుకేషన్ కళాశాలను ఎంపిసి, సిఇసి గ్రూపులతో ఏర్పాటు చేస్తున్నట్టు ఆమె చెప్పారు. ఈ కళాశాలలో చేర్పించాల్సిందిగా సత్యవాడ, పరిసర గ్రామాల నుండి, పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలిసి, అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. క్లాస్ రూములు, అధ్యాపకులు అన్ని వసతులు కల్పించారన్నారు. గత విద్యా సంవత్సరం, ఉండ్రాజవరంలో ఏర్పాటు చేసిన మహిళా కళాశాలతో పాటు సత్యవాడలో ప్రారంభం కానున్న కో ఎడ్యుకేషన్

అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కళాశాలతో కలిపి మండలంలో రెండు ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. వీటితోపాటు రెండు ప్రైవేటు కళాశాలలు మండలంలో ఉన్నాయి. ప్రజలకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలు, బ్యానర్లు, డోర్ టు డోర్ ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు.

క్రియేటివ్ కంటెంట్ శిక్షణ ముగింపు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

ఆర్ట్స్ కళాశాలలో వివిధ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు నిర్వహిస్తున్న మూడు రోజుల క్రియేటివ్ ఈ కంటెంట్ జనరేషన్ శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథి ఆంధ్ర రాష్ట్ర కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి కృష్ణ మాట్లాడారు. ఉన్నత విద్య బోధనా విధానంలో వస్తున్న పెను మార్పులను కళాశాల అధ్యాపకులు ఆకళింపు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కత్రిమ మేధను ఉపయోగించి పాఠ్యప్రణాళికను రూపొందించి తదనుగుణంగా విద్యాబోధన జరగాలని, ఇటువంటి కార్యశాలలు దానికి ఉపకరిస్తాయని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర.ఆర్‌కె మాట్లాడుతూ అధ్యాపకులు డిజిటల్ పెడగాగి పద్ధతులను తమ విద్యాబోధనలో ఇనుమడింప చేయాలని సూచించారు. ఉన్నత విద్యలో నిన్న-నేడు-రేపు అను ప్రాతిపదికన వస్తున్న మార్పులను వివరించారు. ఈ పద్ధతులను ఎఐతో అనుసంధానించి విద్యాబోధనలను సాగించడంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ముందంజలో ఉందని వివరించారు. కత్రిమ మేధా పద్ధతులలో ప్రవీణులైన డాక్టర్ సునీల్ మ్యాజిక్ స్కూల్ వంటి సాఫ్ట్‌వేర్లను ఉపయోగించి పాఠ్యప్రణాళికను ఎలా రూపొందించవచ్చో వివరించారు. కత్రిమ మేధను ఉపయోగించడంలో ప్రాంటింగ్‌కు గల ప్రాముఖ్యతను వివరించారు. సరైన ప్రాంటింగ్ పద్ధతులను ఉపయోగించినప్పుడు మాత్రమే ఆశించిన ఫలితాలు పొందగలమని తెలిపారు. బెంగళూరు నుంచి వచ్చిన డాక్టర్ నాగేంద్ర ఇంక్ స్కేప్, అడోబ్ ఇలస్ట్రేటర్‌ను ఉపయోగించి వెక్టర్ డ్రాయింగ్‌పై తర్ఫీదు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి బి.వెంకట్రావు సమన్వయకర్తగా, ఎపిసిసిఇ నుంచి వచ్చిన డాక్టర్ జె.జ్యోతి పర్యవేక్షకురాలుగా వ్యవహరించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాల నుంచి 86 మంది అధ్యాపకులు హాజరయ్యారు. ఎన్.శ్రీనివాస్, సంజీవ్ కుమార్, కిరణ్ కుమార్, ప్రవీణ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

పలుచోట్ల విద్యార్థులకు వేసవి శిబిరాలు

ప్రజాశక్తి-యంత్రాగం

చాగల్లు శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు నీతి కథలు చెప్పడం, విద్యార్థులతో చదరంగం ఆడించడం, పుస్తక సమీక్ష, పుస్తక పఠనం చేయించడం కార్యక్రమాలు నిర్వహించినట్టు గ్రంథాయాధికారి జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 9 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వేసవిజ్ఞాన శిబిరాలు జూన్ 7వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు.

రాజమహేంద్రవరం రూరల్ గౌతమీ గ్రంథాలయంలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 30 మంది విద్యార్థులు వేసవి శిబిరంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కథలు చదివించడం, మ్యాథ్స్, స్పోకెస్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్స్, వేదగణితం వంటి వివిధ అంశాలను పిల్లలకు నేర్పిస్తున్నట్టు గ్రంథాలయాధికారి ఘంటా శ్రీదేవి తెలిపారు.

కడియం శాఖా గ్రంథాలయాధికారి నిర్మల ఆధ్వర్యంలో హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణ వేణి శిబిరంలో మాట్లాడారు. పంచతంత్రం, నీతికథలను గ్రంథాలయ సభ్యులు విద్యార్థులకు వివరించారు.

6 వరకు నన్నయ వర్సిటీకి సెలవు

ప్రజాశక్తి రాజానగరం

కలెక్టర్ సూచనల మేరకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని రోజు వారీ కార్యక్రమాలను జూన్ 6వ తేదీ వరకు నిలుపుదల చేస్తున్నామని విసి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. దీనిపై ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇవిఎంలు, ఇతర ఎన్నికల పత్రాలు, ఓట్ల లెక్కింపు కోసం కౌంటర్లు, స్ట్రాంగ్ రూమ్స్ ఉన్న కారణంగా యూనివర్సిటీ క్యాంపస్‌ను 'నో మ్యాన్ జోన్'గా ఎన్నికల కమిషన్, కలెక్టర్ సూచనలు ప్రకారం ప్రకటించామన్నారు. విశ్వవిద్యాలయ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు సహకరించాలని కోరారు.

సంతోషి దేవికి పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కంప్యూటర్ సైన్స్‌లో అరిగెల శ్రీసంతోషి దేవికి విసి ఆచార్య కె.పద్మరాజు శనివారం పిహెచ్‌డి ప్రదానం చేశారు. సిఎస్ఇలోని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.పెర్సిస్ మార్గదర్శకత్వంలో 'కళాశాల విశ్వవిద్యాలయ స్థాయిల్లో విద్యార్థుల బదిలీల ధ్రువీకరణ కోసం బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ సొల్యూషన్ పని తీరు' అనే అంశంపై సంతోషి దేవి పరిశోధన చేశారు. ఈ సాంకేతిక పరిశోధన ద్వారా భద్రతతో పారదర్శకంగా సర్టిఫికెట్లు అందుతాయని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ సంతోషిదేవిని అభినందించారు.

తాళ్లపూడిలో అన్నదానం

ప్రజాశక్తి-తాళ్లపూడి

వాసవీ మాత జయంతి సందర్భంగా శనివారం తాళ్లపూడి బస్టాండ్ సెంటర్ వద్ద ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పల్లకిలో బ్రహ్మోత్సవం నిర్వహించి అనంతరం ఆలయంలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు జంధ్యాల గంగాధర్ శర్మ పాల్గొన్నారు.

నేడు వెంకన్న కల్యాణోత్సవం

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని అన్నవరప్పాడులో జాతీయ రహదారి ప్రక్కన ఉన్న వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణోత్సవం ఆదివారం నుంచి 23వ తేదీ గురువారం వరకూ నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఇఒ మీసాల రాధాకృష్ణ తెలిపారు. కళ్యాణోత్సవాలకు చుట్టుపక్కల మండలాలు, ఇతర జిల్లాల నుంచి దాదాపు 40 వేల మంది వస్తారని దేవస్థానం సిబ్బంది అంచనా వేశారు. ఆ మేరకు ఉత్సవాల 5 రోజులూ దాతల సహకారంతో చలివేంద్రం, ప్రసాదం, అన్నదానం ఏర్పాట్లు చేశామన్నారు.

ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు గాను 16 పంచాయితీల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్టు టిఎ శ్రీనివాస్ తెలిపారు. కానూరులో ఫీల్డ్ అసిస్టెంట్ లేని కారణంగా మంజూరైన వర్కులు నిలిచిపోయినట్టు ఆయన తెలిపారు. పంచాయతీ తీర్మానం చేసి కొత్తగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఏర్పాటు చేస్తే ఉపాధి కూలీలతో పూడికతీ పనులు మొదలుపెడతామన్నారు. ఖండవల్లిలో ఫీల్డ్ అసిస్టెంట్ అనారోగ్య కారణంగా గ్రామంలో ఉపాధి పనులు జరగడం లేదన్నారు. కడింపాడు గ్రామంలో చెరువు పూడికతీత మొదలు పెట్టామన్నారు. చెరువు పంట కాలువలు, పంట బోదెలు, పంట మురుగు బోదెల పూడికతీత పనులు చేస్తున్నామన్నారు వేసవి ప్రభావంతో ఉపాధి కూలీలకు వడదెబ్బ తగలకుండా పని ప్రదేశాల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు, తాగునీరు అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

శిక్షణా తరగతులు వాయిదా వేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సాయి శ్రీనివాస్

ప్రజాశక్తి-రాజానగరం

సిబిఎస్ఇ సిలబస్ పేరుతో వేసవి సెలవుల్లో శిక్షణా తరగతులు నిర్వహించడం సరైన నిర్ణయం కాదని వెంటనే వాయిదా వేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజానగరం సమీపంలో గైట్ కళాశాలలో రెండు రోజుల రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ ఉద్యమ శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మాట్లాడుతూ వెకేషన్ డిపార్ట్మెంట్ అయిన విద్యాశాఖలోని ఉపాధ్యాయులను వెకేషన్ నుంచి దూరం చేసే శిక్షణా తరగతులను వాయిదా వేయాలని కోరారు. వెకేషన్ కాలంలో ఎన్నికల విధులలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత రెండు సంవత్సరాలుగా పాఠశాల నిర్వహణ నిధులు క్రమంగా కేటాయించడం లేదని విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠశాల గ్రాంట్లు విడుదల చేయాలన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వంట ఏజెన్సీలకు కుకింగ్ ఛార్జీలు పెంచాలని కోరారు. దీనిలో ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నరసింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శి జోసఫ్ సుధీర్ బాబు, కె.కోటేశ్వరరావు, గాజుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్.రాధాకృష్ణ

సాకేత్ రాఘవ్

తెలంగాణ ఇఎపిసెట్ ఫలితాల్లో తిరుమల సత్తా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఇఎపిసెట్ పరీక్షా ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల విద్యార్థి ఎన్.రాధాకృష్ణ స్టేట్ 2వ ర్యాంకు, ఎస్.సాకేత్ రాఘవ్ స్టేట్ 4వ ర్యాంకు పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. పి.శివ సంపత్ నాయుడు స్టేట్ 25వ ర్యాంకు, విఎస్‌జిఎన్‌వి.రామకృష్ణారెడ్డి స్టేట్ 53వ ర్యాంకు, వి.అభిశ్యామ్ స్టేట్ 64వ ర్యాంకు, డి.ప్రభాస్ స్టేట్ 91వ ర్యాంకులు సాధించారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి అభినందించారు.

ఆకర్షణీయంగా విద్యుత్ నామం

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరంలోని రత్నగిరిపై దేవస్థానం అధికారులు ఇటీవల ఏర్పాటు చేసిన శంకు చక్రాలతో కూడిన విద్యుత్ నామం భక్తులను ఆకర్షిస్తుంది. కొండపైన రెండు దశాబ్దాల క్రితం విద్యుత్ నామం ఒకటే ఏర్పాటు చేశారు. నాణ్యతా ప్రమాణాలు లోపించడమో, పర్యవేక్షణా లోపమో తెలియదుగాని కొద్దికాలంలోనే అది అటకెక్కింది. భక్తుల వినతుల దృష్ట్యా ప్రస్తుత ఇఒ కె.రామచంద్రమోహన్ దీనిపై దృష్టి పెట్టారు. ఎత్తైన కొండపై అందరికీ కనిపించేలా శంకు చక్రాలతో కూడిన నామాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తూ ఆ నామాన్ని చూస్తుంటే హిస్టారికల్‌గా కనిపిస్తుందనే ఆలోచనతో ఇఒ, ఛైర్మన్, పాలకమండలి సభ్యులకు వివరించారు. అంతే వేగంతో దేవస్థానం టెండర్ నిబంధనలను అనుసరించి రూ.63 లక్షలతో శంకు చక్రాలతో కూడిన విద్యుత్ నామాన్ని ఏర్పాటు చేశారు.

ఛైర్మన్‌కు శుభలేఖ అందిస్తున్న అర్చకులు

ఆలయ ఛైర్మన్‌కు తొలి శుభలేఖ అందజేత

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సత్యదేవుని పెండ్లి శుభలేఖ తొలిసారిగా ఆలయ సంప్రదాయంగా వ్యవస్థాపక ధర్మకర్త, ఛైర్మన్ రాజా ఐవి.రోహిత్‌కి అందించారు. శుక్రవారం దేవస్థానం ప్రధాన అర్చకుడు కోట సుబ్బయ్య ఆధ్వర్యంలో అర్చకులు ఎఅందించారు అనంతరం వారికి స్వామివారి కల్యాణోత్సవ శుభలేఖ అందించారు.

రత్నగిరిపై నూతన ధ్వజస్తంభం ప్రతిష్టాపన



ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం శ్రీ వీర వేంకటసత్యనారాయణ స్వామి ప్రధాన ఆలయంలో నెల్లూరుకు చెందిన దాత సహకారంతో నూతనంగా ధ్వజ స్తంభం ప్రతిష్టాపన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ధ్వజస్తంభం ముందు రావిచెట్టు, పక్కన పర్ణశాలను ఏర్పాటు చేశారు. దేవస్థానం ప్రధాన అర్చకులు కోట సుబ్బయ్య ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు, పురోహితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మండపంలో ప్రధాన ఆలయం ఎదురుగా భక్తుల సమక్షంలో దేవస్థానం ఇఒ కె.రామచంద్రమోహన్, చైర్మన్ ఐవి.రోహిత్ దీన్ని ప్రారంభించారు. సుమారు 13 ఏళ్ల క్రితం ఆలయ పున నిర్మాణాన్ని చేపట్టిన సమయంలో అప్పటి ఇఒ, ప్రస్తుత ఇఒ కె.రామచంద్రమోహన్ హయాంలోనే ఈ నూతన ధ్వజస్తంభ ప్రతిష్టాపన జరగడం విశేషం. ఈ ప్రతిష్టాపన ఉత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి సభ్యులు, ఆలయ అధికారులు, పిఆర్ఒ కృష్ణారావు పాల్గొన్నారు.

కళ్యాణ వైభోగమే...

అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాలు ఈ నెల 18 నుంచి 24 వరకూ ఘనంగా జరుగనున్నాయి. కళ్యాణోత్సవాల నేపథ్యంలో రత్నగిరిపై పండుగ వాతావరణం సంతరించుకుంది. కల్యాణ వేడుకలను కనులవిందుగా నిర్వహించేందుకు ఆలయ ఇఒ, చైర్మన్ ఆధ్వర్యంలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలతో సత్యగిరి వెలుగురు విరజిమ్ముతోంది. బంగారు వర్ణ శోభితమైన కల్యాణ వేదికలో ఈ కల్యాణోత్సవాలు జరుగనున్నాయి.

మే 18 నుంచి 24వరకూ సత్యదేవుని కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి - అన్నవరం

రత్నాద్రి వాసుడై, భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్న సత్యనారాయణ స్వామివారి వార్షిక దివ్య కల్యాణం శ్రీక్రోధి నామ సంవత్సర వైశాఖ శుద్ధ దశమి, శనివారం అనగా 18 మే 2024 నంచి వైశాఖ బహుళ పాడ్యమి శుక్రవారం 24 మే 2024 వరకూ జరుగనున్నాయి. కల్యాణోత్సవాల్లో భాగంగా శ్రీక్రోధి నామ వైశాఖ శుద్ధ ఏకాదశి 19 మే 2024 ఆదివారం రాత్రి 9.30 గంటలకు శ్రీ రత్నగిరిపై వార్షిక కళ్యాణవేదిక యందు కళ్యాణోత్సవం జరుగుతుంది. 18న అణివేటి మండపంలో సత్యనారాయణ స్వామి అనంతలక్ష్మి అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లికుమార్తెను చేస్తారు. పెండ్లి పెద్దలు క్షేత్ర పాలకులు శ్రీరామచంద్రమూర్తి సీతాదేవి దంపతుల సమక్ష్యాన వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవాలను నిర్వహించనున్నారు. అనంతరం వేదపండితుల చతుర్వేద స్వస్తి ఆశీర్వచనం గావించారు. ముత్తయిదువలు పసుపు దంచు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దీనికి పలువురు మహిళలు పోటీపడుతుంటారు. ఇందులో పాల్గొనే వారికి తాంబూలాలు సమర్పిస్తారు. అలాగే భక్తులకు ప్రసాదం వితరణ చేస్తారు. అదేరోజు సాయంత్రం కొండపై గల కళామందిరంలో ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా పెండ్లిపెద్దలైన సీతారాములను, వధూవరులైన స్వామి, అమ్మవార్లను వేర్వేరు ఆసనాలపై ఆశీనులను గావించి అర్చక

స్వాములు ప్రత్యేక పూజలు చేస్తారు. తరువాత చైర్మన్, ఇఒలతో పాటు పాలకమండలి సభ్యులు, పండితులు స్వామి, అమ్మవార్ల తరపున రెండు జట్లుగా విడిపోయి పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తె గుణ, గుణాలను, వంశ చరిత్రను వర్ణిస్తూ ఒకరిపై ఒకరు చమత్కారాలు, హాస్యోక్తులతో రక్తి కట్టించనున్నారు. 19వ తేదీ రాత్రి 9.30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పలువురు ప్రముఖులు కూడా ఈ కల్యాణోత్సవానికి హాజరుకానున్నారు. కల్యాణాన్ని తిలకించే భక్తుల కోసం ఈ ఏడాది ప్రసాదంతో పాటు బూరి కూడా వేయనున్నారు. అలాగే వేసవి నేపథ్యంలో మజ్జిగ, తాగునీరు, పిల్లలకు పాలను వితరణ చేయనున్నారు. 20న రావణబ్రహ్మ వాహన సేవలో భాగంగా స్వామి, అమ్మవార్లను రావణబ్రహ్మ వాహనంపై ఆసీనులను చేసి గ్రామోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 7గంటలకు అరుంధతీ నక్షత్ర దర్శనం ఉంటుంది. 21వ తేదీ మధ్యాహ్నం కొండపై అణివేటి మండపంలో క్షేత్రపాలకులు శ్రీసీతారాముల సమక్షంలో స్వామి, అమ్మవార్లకు సరస్వతీదేవి పూజ, మహదాశీర్వచనము, సంగీత సదస్యము, పండిత సత్కారము ఉంటుంది. సాయంత్రం పొన్నవాహన సేవలో భాగంగా స్వామి, అమ్మవార్లను పొన్న వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తారు. 22న వన విహారోత్సవాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా స్వామి, అమ్మవార్లను వెండి రథంపై ఊరేగిస్తారు. 23న స్వామి, అమ్మవార్లకు పంపాసరోవరంలో చక్రస్నానం చేయిస్తారు. 24న శ్రీ పుష్పయాగములో భాగంగా స్వామి అమ్మవార్లను శేషపాన్పుపై ఉంచి సేవలందిస్తారు. ఈ ఆరు రోజులపాటు వివిధ వైదిక కార్యక్రమాలతో పాటూ పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

రథసేవకు పెరుగుతున్న ఆదరణ

అన్నవరం: అన్నవరం రత్నగిరిపై దేవస్థానం ఇఒ కె.రామచంద్రమోహన్ ఇటీవల ప్రవేశపెట్టిన కొత్త ఆర్జిత రథసేవకు భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. రూ.కోటితో నాణ్యమైన టేకు కలపను కొనుగోలు చేసి 38 అడుగుల పెద్ద రథాన్ని తయారు చేయించారు. కొండ దిగువ నిర్వహించే సత్యదేవుని బ్రహ్మోత్సవం, ఇతర పర్వదినాల్లో జరిగే స్వామి వారి ఊరేగింపుల్లో దీన్ని వినియోగిస్తారు. అలాగే కొండపైన రూ.18 లక్షలతో చిన్న రథాన్ని తయారు చేయించి ఆ రథంపై ప్రతి ఆదివారం భక్తులు భాగస్వామ్యం ఉండేలా కొండపైన ప్రాకార సేవ నిర్వహిస్తున్నారు. రూ.2,500 చెల్లించి భక్తులు ఈ రథసేవను చేయించుకోవచ్చు. ఐదుగురు భక్తులు ప్రత్యక్షంగా ప్రాకార సేవలో పాల్గొనడమే కాకుండా అంతరాలయ దర్శనం, స్వామివారి కండువా, అమ్మవారి రవికతో పాటు వేద ఆశీస్సులు వంటి సదుపాయాలు అందిస్తున్నారు. దీంతో ఈ రథసేవలు భక్తులు విరివిగా పాల్గొంటున్నారని దేవస్థానం పిఆర్ఒ దామెర్ల కృష్ణారావు తెలిపారు.

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం...

'ప్రజాశక్తి'తో దేవస్థానం చైర్మన్ శ్రీరాజా ఐవి.రోహిత్

ప్రజాశక్తి - అన్నవరం

ప్రతి ఏడాది నిర్వహించే సత్యదేవుని వార్షిక బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు యాత్రికులందరికీ ఇబ్బందులు లేకుండా జరిపించడానికి చైర్మన్‌గా తనవంతు సహకారం అందిస్తున్నానని దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ శ్రీరాజా ఐవి.రోహిత్ తెలిపారు. తన బంగ్లాలో శుక్రవారం ఈ ఉత్సవ ఏర్పాట్లపై ప్రజాశక్తితో మాట్లాడారు. తాను చైర్మన్‌గా 2016లో పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇది 8వ వార్షిక కళ్యాణమని తెలిపారు. ఈ ఉత్సవ ఏర్పాట్లు గురించి ముందుగానే పాలకమండలి సమావేశం నిర్వహించామని తెలిపారు. కళ్యాణ ఏర్పాట్లు, బాధ్యతలపై తగిన సలహాలు, సూచనలను సమావేశంలో తీసుకున్నామన్నారు. గత వార్షిక కల్యాణ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తిలకించే యాత్రికులకు అనుగుణంగా సదుపాయాలు కల్పించడానికి అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలకు అధికారులు అందించే ఏర్పాట్లపై తాను క్షేత్రస్థాయిలో తిరిగి క్షుణ్ణంగా పరిశీలన జరిపినట్లు తెలిపారు. ఈ ఏడాది జరుగుతున్న ఉత్సవాల్లో ప్రస్తుతం వాతావరణం ప్రతికూల పరిస్థితులు దృష్ట్యా బహిరంగంగా నిర్వహించే వార్షిక కళ్యాణ వేదికతో పాటు ప్రత్యామ్నాయంగా నిత్య కళ్యాణ మండపం ఆవరణలో కళ్యాణ్ నిర్వహణకు వేదికను సిద్ధంగా ఉంచాలని తాను అధికారులకు సూచించినట్లు చెప్పారు. వేసవి పరిస్థితులు దృష్ట్యా ప్రధానంగా తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కల్యాణోత్సవాలకు వచ్చే భక్తులకు ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, పాలకవర్గం సమన్వయంతో తగిన ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.. రానున్న కాలంలోనూ రత్నగిరిని మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతు సాయం ఎప్పుడూ అందిస్తానని తెలిపారు.

సత్యదేవుని ప్రసాదం...అమృతమయం

ఏటా 1.70 కోట్ల ప్యాకెట్లు విక్రయం
దేవస్థానానికి రూ.34 కోట్ల మేర ఆదాయం

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం శ్రీవీరవెంకట సత్యన్నారాయణ స్వామివారి ప్రసాదానికి కూడా ప్రత్యేకత ఉంది. దీన్ని రుచి చూసిన వారు ఎప్పటికీ మర్చిపోలేరు. ప్రసాదం తయారీలో నాణ్యతా ప్రమాణాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు ఇక్కడ అధికారులు. ప్రసాదం తయారు చేసే బూతాది విభాగంలో ప్రతిరోజూ 9 మంది వంట కుక్‌లు, 20 కళాయిల్లో ఉదయం, సాయంత్రం రెండు సార్లు ప్రసాదాన్ని తయారు చేస్తున్నారు. బంగి ప్రసాదం కూడా రోజుకు 4 కళాయిల ద్వారా తయారు చేస్తారు. ఇలా తయారు చేసిన ప్రసాదాన్ని 200 గ్రాముల చొప్పున ప్యాకింగ్ చేస్తారు. ఈ పాకెట్లను కొండపైన రెండు కౌంటర్లు, కొండదిగువున ఒకటి, బైపాస్‌లో స్వామి వారి నమూనా ఆలయం వద్ద ఒక కౌంటర్ ద్వారా విక్రయిస్తారు. స్వామి వారి ప్రసాదం తయారీకి ఉపయో గించే ముడిసరుకు నాణ్యత గల గోధు మలు, డెయిరీ ఆవు నెయ్యి, పంచదారను ఉపయోగిస్తారు. బంగి ప్రసాదం తయారీకి కరాచీ నూక, నెయ్యి, పంచదార వినియోగి స్తారు. బంగి ప్రసాదం ఎక్కువ రోజులు నిల్వ ఉండడం వల్ల సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు ఎక్కువ కొనుగోలు చేస్తుంటారు. అందుకే రోజుకు ఈ బంగీ ప్రసాదం 1,500 ప్యాకెట్లు విక్రయాలు జరుగుతాయి. గోధుమ, బంగీ ప్రసాదం ప్యాకెట్లు అపరిమిత సంఖ్యలో తయారు చేసి అందించే యంత్రాంగం దేవస్థానం బూతాది విభాగంలో ఉందని సంబంధిత అధికారి ప్రజాశక్తికి తెలిపారు. గతంలో విఐపి ప్రసాదాలు అందించేవారు. దీనిపై విమర్శలు రావడంతో ప్రస్తుతం భక్తులందరికీ ఒకే ప్రసాదాన్ని అమలు చేసేలా ఇఒ చర్యలు చేపట్టారు. రోజవారీ ప్రసాదం కాకుండా ఉదయం ఒకసారి, సాయంత్రం ఒకసారి ప్రసాదాన్ని ఎప్పటికప్పుడు తయారు చేసి భక్తులకు అందిస్తున్నారు. దీని వల్ల ప్రసాదంలో నాణ్యత మరింత పెరిగింది. ప్రసాదంలో నాణ్యతా ప్రమాణాలు కూడా మెరుగుపరిచేందుకు ఇఒ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రసాదం ప్యాకెట్లు ఏటా 1.70 కోట్లు అమ్ముడవుతున్నాయి. దీని ద్వారా ఏటా రూ.34 కోట్లు, అలాగే 8 లక్షలు బంగీ ప్రసాదం ప్యాకెట్లు కొనుగోలు ద్వారా. సుమారు రూ.కోటి వరకు ఆదాయం దేవస్థానానికి సమకూరుతోంది.